## క్లుప్తంగా...

### టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ



టీబీ రోగులకు పౌష్టికాహారం కిట్లను అందజేస్తున్న పరమేశ్వరి

**శంషాబాద్:** టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా పట్టణంలోని త్రినేత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదో నెల పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం నిర్వహించారు. గత ఐదు మాసాలుగా సొంత నిధులతో త్రినేత్ర ఫౌండేషన్ చైర్మన్ మడపతి పరమేశ్వరీ టీబీ రోగులకు పౌష్టికాహారం కిట్లను అందజేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కవిత, పద్మ, అరుణ, రజిత, అపర్ణ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

### పాల్మాకుల చెక్‌పోస్టును పరిశీలించిన డీసీపీ



పాల్మాకుల చెక్‌పోస్టును సందర్శించిన డీసీపీ నారాయణరెడ్డి

**శంషాబాద్ రూరల్:** తనిఖీల సమయంలో వాహనదారులతో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని డీసీపీ కె.నారాయణరెడ్డి సూచించారు. మండలంలోని పాల్మాకుల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. తనిఖీ చేసేటప్పుడు తగు జాగ్రతలు తీసుకోవాలని డీసీపీ సూచించారు. ఆయన వెంట అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్, ఏసీపీ రాంచందర్‌రావు, సీఐ శ్రీధర్‌కుమార్ ఉన్నారు.

### మద్యం బాటిళ్లు స్వాధీనం

**శంషాబాద్ రూరల్:** పోలీసులు బెల్టుషాపులపై దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంఘీగూడలోని కిరాణా దుకాణాల్లో మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. లావణ్య కిరాణా దుకాణం, పరమేశ్వర్ కిరాణా షాపులో బీరు, మద్యం బాటిళ్లు దొరికాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### 13న హెచ్‌సీయూ స్నాతకోత్సవం

**రాయదుర్గం:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవాన్ని 13వ తేదీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 11 గంటలకు గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.బీజేరావు పర్యవేక్షణలో జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఎం జగదీష్‌కుమార్, గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్యరాజన్, హెచ్‌సీయూ చాన్స్‌లర్ జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి పాల్గొంటారు.

### ఆర్థిక ఇబ్బందులు తాళలేక..

**మైలార్‌దేవ్‌పల్లి:** ఆర్థిక ఇబ్బందులు తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ అలీ తెలిపిన వివరాల ప్రకారం..వట్టెపల్లి మహమ్మదీయ కాలనీకి చెందిన జవాదుద్దీన్ (19) మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి.దీంతో సోమవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రమాదవశాత్తు కిందపడి భవన నిర్మాణ కార్మికుడు మృతి

**మణికొండ:** నిర్మాణంలో ఉన్న భవనం నాలుగో అంతస్తులో సెంట్రింగ్ పనిచేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నంబర్ 3లో సెంట్రింగ్ కార్మికునిగా లంగర్‌హౌస్ లక్ష్మీనగర్‌కు చెందిన నర్సింగ్‌రావు(40) పనిచేస్తున్నాడు. మంగళవారం పనిచేస్తున్న క్రమంలో 4వ అంతస్తు నుంచి కిందపడటంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఇంకా తమకు ఫిర్యాదు అందలేదని, అందగానే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

# టికెట్ దక్కేదెవరికో..?

**కాంగ్రెస్, బీజేపీలో పదుల సంఖ్యలో ఆశావహులు**

**మణికొండ:** అందరూ ఊహించినట్టే రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల నగారా మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణతో పాటు మరో నాలుగు రాష్ట్రాల ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించిన విషయం తెలిసిందే. సోమవారం షెడ్యూల్ విడుదల అయ్యే గంట ముందు వరకు ప్రారంభోత్సవాలను కొనసాగించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావటం, ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో ఒక్కసారిగా అధికారిక కార్యక్రమాలు నిలిచిపోయాయి. ఇక నుంచి ప్రజాప్రతినిధులు అధికారిక కార్యక్రమాలు కాకుండా రాజకీయ, పార్టీ కార్యక్రమాలనే నిర్వహించాల్సి ఉంటుంది. అధికారులు ఎన్నికల నిర్వహణ పనుల్లో నిమగ్నమయ్యారు.

**అధికార పార్టీ ముందంజ..**

రాష్ట్రంలో షెడ్యూల్ కంటే ముందే ఎన్నికలు వస్తాయని, అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఆలోచనలు చేసినా ఇతర పార్టీలతో పోల్చుకుంటే ఇప్పటికే అధికార పార్టీ తమ ఎమ్మెల్యే అభ్యర్థిగా టి. ప్రకాశ్‌గౌడ్‌ను ప్రకటించింది. ఆయన ఎమ్మెల్యేగా నిత్యం ప్రజల్లో ఉండటంతో పాటు ప్రతి వార్డు, గ్రామస్థాయిలో మంచి క్యాడర్ ఉండటంతో ప్రచారానికి సమస్య లేదు.

**ప్రతిపక్షాల్లో నిస్తేజం...**

ఇప్పటికే అధికార పార్టీ అభ్యర్థిని ప్రకటించటం, ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థుల విషయం తేలకపోవటంతో ఆయా పార్టీల క్యాడర్



రాజేంద్రనగర్ నియోజకవర్గం మ్యాప్



బీఆర్ఎస్ అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్

నిస్తేజంగా ఉంది. నియోజకవర్గంలో మరో ప్రధాన పార్టీ అయిన ఎంఐఎంతో బీఆర్ఎస్‌కు పొత్తు ఉందని ఆ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ ప్రకటించారు. ఇక కాంగ్రెస్ పార్టీ నుంచి 11మంది, బీజేపీ నుంచి ఏకంగా 56మంది తమకు టికెట్‌లు కావాలని దరఖాస్తు చేసుకున్నారు. వడపోసి ముగ్గురు అభ్యర్థుల పేర్లను ఢిల్లీలోని పార్టీ హైకమాండ్‌కు పంపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కె.నరేందర్ ముదిరాజ్, గౌరి సతీష్‌ల పేర్లు, బీజేపీ నుంచి తోకల శ్రీశైలంరెడ్డి, తోకల శ్రీనివాస్‌రెడ్డి, తోక అంజన్‌కుమార్‌గౌడ్‌ల పేర్లు ఉన్నట్టు ఆయా పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. వారిలో ఎవరికి పార్టీ బీఫాంలు అందుతాయనే చర్చ నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగుతుంది. ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులకు టికెట్‌లను కేటాయించి వారు ఎన్నికల బరిలోకి దిగితేగాని రాజేంద్రనగర్ నియోజకవర్గంలో స్పష్టత వచ్చే అవకాశం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎన్నికలకు కేవలం 50 రోజులే సమయం ఉండటం, నియోజకవర్గంలో ఏకంగా ఐదున్నర లక్షల మంది ఓటర్లు ఉండటంతో వారిని కలిసేందుకు సమయం సరిపోతుందా.. అనే మీమాంసలో ఉన్నారని సమాచారం.

**రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు..**

| | |
|---|---|
| మహిళలు | 2,88, 270 |
| పురుషులు | 2,64,053 |
| థర్డ్ జెండర్‌లు | 39 |
| వికలాంగులు | 3,738 |
| నడవలేని వృద్ధులు | 5,002 |
| కొత్త ఓటర్లు | 10,488 |
| ఎన్ఆర్ఐలు | 80 |
| సర్వీసు ఓటర్లు | 93 |
| మొత్తం | 5, 52, 362 |
| పోలింగ్ బూత్‌లు | 535 |

## సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్నేహితహిల్స్ కాలనీవాసులు

**బండ్లగూడ:** ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో తనవంతు సహాయసహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ స్నేహితహిల్స్‌లో డ్రైనేజీ, రోడ్ల సమస్య తీవ్రంగా ఉందని సమస్యలు పరిష్కరించాలని కాలనీ వాసులు మంగళవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో వెంటనే ఎమ్మెల్యే డీఈ యాదయ్యకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ స్నేహితహిల్స్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు.కార్యక్రమంలో మోహన్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తిరుపతయ్యగౌడ్, జైరామయ్య, రవీందర్‌రెడ్డి, దాస్, సంగారెడ్డి తదితరులున్నారు.

### 'ఐఎస్‌బీ'లో పోస్టల్ దినోత్సవం



**రాయదుర్గం:** పోస్టుకార్డు, లెటర్ వంటివి గుర్తు చేసుకున్న వేళ.. జాతీయ పోస్టల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ప్రాంగణంలో పోస్ట్ బాక్స్ వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐఎస్‌బీ ప్రాంగణంలో విద్యార్థులు, ఫ్యాకల్టీ, ఇతర అధికారులు, ఉద్యోగులు దేశ నిర్మాణానికి పోస్టల్ రంగం సహకారాన్ని గుర్తించి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. ఐఎస్‌బీ యొక్క మౌలిక సదుపాయాలు, వృక్షజాలం, జంతు జాలం యొక్క అందం తదితరాలను వారికి ఇష్టమైన వారికి పంపించేలా ప్రత్యేకంగా రూపొందించిన పోస్ట్ కార్డులను అధ్యాపకులు, సిబ్బంది పోస్ట్ చేసి 'మెమోరీస్ ఇన్ మెయిల్' పేరిట నిర్వహించుకున్నారు.

### ఆశ వర్కర్‌ల సమ్మె వాయిదా



సమ్మె విరమిస్తున్నట్టు వైద్యాధికారికి లేఖ ఇస్తున్న ఆశ వర్కర్‌లు, సీఐటీయూ నాయకులు

**మణికొండ:** ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి కమిటీని ఏర్పాటు చేస్తామని ఆరోగ్యశాఖ డైరెక్టర్ హామీ ఇవ్వటంతో తమ సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని వారు ప్రకటించారు. అందుకు అనుగుణంగా మంగళవారం గండిపేట మండల వైద్యాధికారి పద్మకు సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో లేఖను అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఆశ వర్కర్‌లకు వేతనం, రూ.18వేలు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్‌లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్‌ల యూనియన్ నాయకులు లత, అరుణ, శంకరమ్మ, శ్రీదేవి, స్వప్న, సుజాత, ప్రశాంతిలు పాల్గొన్నారు.

## గుడిమల్కాపూర్‌లో 'మేరీ మాటీ మేరా దేశ్'



కార్యక్రమంలో బీజేపీ కార్వాన్ ఇన్‌చార్జి అమర్‌సింగ్ తదితరులు

**గోల్కొండ:** ప్రధాని మోదీ పాలనలో భారత దేశం ప్రపంచంలోనే అగ్రదేశంగా రూపొందిందని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి అమర్‌సింగ్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద 'మేరీ మాటీ మేరా దేశ్'కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో దేశం ఆర్థికంగా బలహీనంగా ఉండేదని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలతో ప్రపంచ వేదికలపై భారతదేశం కనుమరుగైందన్నారు. మోదీ సమర్థపాలనలో నేడు ప్రపంచ వ్యాప్తంగా భారతదేశం అంటే ఒక బలమైన దేశంగా ..ఆర్థికంగా..రక్షణ రంగంలో కూడా బలీయమైన శక్తి అని గుర్తింపబడుతుందని అన్నారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగు కావడం ఖాయమని ఆయన అన్నారు. భారీ మెజార్టీతో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.సునీల్‌యాదవ్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, ఆకుల గోవర్ధన్ తదితరులున్నారు.

### ఆస్పత్రిని శుభ్రంగా ఉంచాలి




సీఎంఈ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మల్లికార్జున్

**గోల్కొండ:** ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచడం సిబ్బంది బాధ్యత అని సీఎంఈ ప్రోగ్రామ్ ఆఫీసర్ డి.మల్లికార్జున్ అన్నారు. మంగళవారం ఆస్పత్రిలో సీఎంఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో మోటారిటీ తగ్గించడంతో పాటు క్వాలిటీ వైద్య సేవలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కొంత కాలంగా నగరంలో ప్రబలిన సీజనల్ వ్యాధుల కారణంగా ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య బాగా పెరిగిందన్నారు. పెరుగుతున్న ఔట్ పేషంట్లకు అనుగుణంగా సిబ్బంది వచ్చిన రోగులకు నాణ్యమైన వైద్యంతో బాటు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఔట్, ఇన్ పేషంట్స్ విభాగాల వద్ద పరిశుభ్రతను పాటించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహరుల్లా, రాష్ట్ర క్వాలిటీ కన్సల్టెంట్ ఆఫీసర్ ఆశోక్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ పీఓ మల్లికార్జున్, ప్రశాంత్, ఆర్.రాము, ఏఏఓ డాక్టర్ శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

### నివాళి



బాబురావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

**రాజేంద్రనగర్:** నిరుపేదల పక్షాన నిలిచి వారి సమస్యల కోసం మాజీ కౌన్సిలర్ మజ్జిగ బాబురావు ఎంతగానో పాటుపడ్డారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అన్నారు. బాబురావు మొదటి వర్ధంతి సందర్భంగా బుద్వేల్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబురావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పోరెడ్డి ధర్మారెడ్డి, రగడంపల్లి శ్రావణ్, సాయి మలిక్, మహాత్మ, పలుగుచెరువు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల కోడ్.. ఫ్లెక్సీలు తొలగింపు



రాజేంద్రనగర్ ప్రధాన రహదారిపై ఫ్లెక్సీని తొలగించిన అధికారులు

**రాజేంద్రనగర్:** ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో జీహెచ్ఎంసీ అధికారులు మంగళవారం రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్, అత్తాపూర్ డివిజన్ల పరిధిలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఏర్పాటు చేసిన బ్యానర్లు, ఫ్లెక్సీలు, కటౌట్‌లను తొలగించారు. గోడలపై వాల్ పోస్టర్‌లను తీయించి వేశారు.

### సమస్యల పరిష్కారానికి కృషి

**గోల్కొండ:** మజ్లిస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకి వద్ద స్థానికులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు.

### అక్రమ పార్కింగ్ .. జరిమానా

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారులు, అంతర్గత బస్తీలకు వెళ్లే ప్రాంతాల్లో అక్రమ పార్కింగ్‌ను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహగౌడ్ తెలిపారు. ఉప్పర్‌పల్లి చౌరస్తా నుంచి కోర్టుకు వెళ్లే రహదారి ఇరువైపులా అక్రమ పార్కింగ్‌తో నిత్యం ఇబ్బందులు కలుగుతున్నాయి. హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, దుకాణాల ముందు వాహనాలను అడ్డదిడ్డంగా పార్కు చేయడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందన్నారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఉదయం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. రోడ్లపై అక్రమంగా పార్కు చేసిన వాహనాలకు జరిమానాలను విధించారు.



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ నర్సింహగౌడ్

## యువత నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి



ఉద్యోగ నియామకపత్రాలు అందజేస్తున్న దృశ్యం

**బండ్లగూడ:** యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యాభారతీ దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి వెల్లడించారు. శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో అపెక్స్ ఇండియా సౌజన్యంతో నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శిక్షణ పొందిన యువతకు ఉద్యోగ నియామకపత్రాలను మంగళవారం అందజేశారు. 35 మంది శిక్షణ పొందగా 35 మందికి వివిధ సంస్థలలో ఉద్యోగాలు రావడం విశేషమన్నారు. శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో యువతకు నైపుణ్యంలో స్వల్పకాలిక కోర్సులను ప్రవేశపెట్టిందని అన్నారు. కార్యక్రమంలో శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాసరావు, ప్రాంత కార్యదర్శి ముక్కాల సీతారాములు, అపెక్స్ ఇండియా ప్రతినిధులు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## సీబీఐటీ సహాయ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



స్పందన

**మణికొండ:** వ్యవసాయ రంగంలో ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ టెక్నాలజీ ఏ విధంగా ఉపయోగపడుతుందనే అంశంపై పరిశోధన చేసి తక్కువ సమయంలో మట్టిలోని పోషకాలను ఎలా కనుగొనవచ్చో నిరూపించిన చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాల సహాయ ప్రొఫెసర్ కె. స్పందనకు డాక్టరేట్ లభించింది. సీఎస్ఈ విభాగంలో సహాయ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆమె ఉస్మానియా యూనివర్సిటీలో పరిశోధన చేశారు. మట్టిని విశ్లేషించేందుకు అనేక సహజ పద్ధతులు ఉన్నప్పటికీ టెక్నాలజీని ఉపయోగించి తక్కువ సమయంలో మట్టిలోని పోషకాలను కనుగొనడం, దాన్ని బట్టి ఏ పంటను వేయాలనే విషయాన్ని అందులో వివరించారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం, న్యావనంది గ్రామ మట్టి నమూనాలను సేకరించి పోషకాలను కనుగొన్నారు. సీబీఐటీ ఏఈసీ డైరెక్టర్, ప్రొఫెసర్ సురేష్ పబ్బోజు పర్యవేక్షణలో పరిశోధన చేశారు. స్పందనకు డాక్టరేట్ రావటంతో కళాశాల ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ రమణ దుగ్యాలతో పాటు ఇతర అధ్యాపకులు ఆమెను అభినందించారు.

### బతుకమ్మ చీరల పంపిణీ



చీరల పంపిణీలో జీహెచ్ఎంసీ ప్రాజెక్టు అధికారి రాధారాణి

**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో మంగళవారం బతుకమ్మల చీరల పంపిణీ ప్రారంభమైంది. సోమవారం ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో అధికారులు పంపిణీ కార్యక్రమాన్ని నిలుపుదల చేశారు. సర్కిల్ పరిధిలో 60 సెంటర్లలో జీహెచ్ఎంసీ చీరలను పంపిణీ చేస్తుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం సెంటర్లలో పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. బతుకమ్మ చీరల కవర్లలో ఉన్న ప్రచారం కాగితాలను తొలగించడంతో కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్లను తొలగించి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కాగా ఉదయం ఈ సెంటర్లను జీహెచ్ఎంసీ ప్రాజెక్టు అధికారి రాధారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మంగళవారం సాయంత్రానికి 26 వేల చీరలను పంపిణీ చేశామన్నారు.

### చిత్రప్రదర్శన ప్రారంభం

**మాదాపూర్:** మాదాపూర్ చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో మంగళవారం ఏర్పాటు చేసిన జోయస్ సర్క్యూట్ ఆఫ్ లైఫ్ పేరిట ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను జెఎన్ఎఫ్ఏయూ వీసీ డాక్టర్ కవిత కళాకారులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తున్నాయని తెలిపారు. అక్టోబర్ 26వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో 52 చిత్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉదయం 10గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందని తెలిపారు.





### సంస్కృతికి కేరాఫ్ హైదరాబాద్

**ప్రముఖ చరిత్రకారుడు అల్లం ఐజాజ్ ఫరూఖ్**

**రాయదుర్గం:** హైదరాబాద్ సంస్కృతికి సంబంధించిన నగరమని ప్రముఖ చరిత్రకారుడు అల్లం ఐజాజ్ ఫరూఖ్ అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో ముఖరం జా స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని సెంటర్ ఫర్ ఉర్దూ కల్చర్ స్టడీస్ (సీయూసీఎస్) ఐఎంసీ ప్రివ్యూ థియేటర్‌లో నిర్వహించారు. వీసీ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ హైదరాబాదీ సంస్కృతిని దక్కనీ భాష, కవిత్వం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. అంతకు ముందు రెండు పుస్తకాలతోపాటు కేంద్రం ప్రచురించిన రెఫర్డ్ జర్నల్ 'అదాబ్-ఓ-సకాఫత్' తాజా సంచికను ఆవిష్కరించారు.

### రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే



కాంగ్రెస్ ఎన్నికల హామీల పత్రంతో కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ తదితరులు

**గోల్కొండ:** రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. మంగళవారం కార్వాన్‌లో కాంగ్రెస్ ముఖ్య నాయకులు, సీనియర్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ఎన్నికల పత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలకు తెలంగాణ పెట్టింది పేరని చెప్పుకునే బీఆర్ఎస్ ప్రభుత్వం నాణానికి మరోవైపు ఉన్న విషయాన్ని మాత్రం దాచిపెడుతుందన్నారు. తొమ్మిదేళ్లుగా తెలంగాణలో నిరుద్యోగం బాగా పెరిగిందని, ఉపాధి కల్పన కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు ఎక్కడ అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎవరు ఊహించని విధంగా పాలన సాగుతుందని ఇప్పటికే ఆరు హామీలను కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు చంటిబాబు, శ్రీరాములు, అబ్దుల్ హమీద్, వినోద్‌సింగ్, జి.కృష్ణ, హబీబ్, అతర్, ఇషాక్, నర్సింహారెడ్డి తదితరులున్నారు.

## జీఎన్ఐటీఎస్‌లో టై గ్రాడ్ కిక్ ఆఫ్ 2023-24



కార్యక్రమంలో జీఎన్ఐటీఎస్ వైస్ చైర్‌పర్సన్ శ్రీ విద్యారెడ్డి తదితరులు

**గోల్కొండ:** శాస్త్రసాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఇంజినీరింగ్ విద్యార్థులు తమ ఆలోచన ధోరణి, భవిష్యత్తు ప్రణాళికలను సరి చేసుకోవాలని టై గ్రాడ్ చైర్మన్ భాను ప్రకాష్ వర్ల అన్నారు. మంగళవారం షేక్‌పేట్ వద్ద గల జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన టైగ్రాడ్ కిక్ ఆఫ్ 2023-24 సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి విద్యార్థుల్లో జిజ్ఞాస బాగా పెరిగిందని తమకు నచ్చిన విషయంపైనే వారు పరిశోధనలు చేస్తూ ముందుకు సాగుతూ విజయం సాధిస్తున్నారన్నారు. హైదరాబాద్ టై బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ రాజీసామల మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపన, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కావాల్సిన సహాయ సహకారాలు అందించడానికి ఇటువంటి వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం జీఎన్ఐటీఎస్ టై గ్రాడ్ ప్లస్ మధ్య జరిగిన ఒప్పందాన్ని జీఎన్ఐటీఎస్, టై గ్రాడ్ ప్రతినిధులు ఒకరికొకరు ఇచ్చుకున్నారు. జీఎన్ఐటీఎస్ వైస్ చైర్‌పర్సన్ శ్రీవిద్యారెడ్డి గుణంపల్లి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లి రమేష్‌రెడ్డి, జీఎన్ఐటీఎస్ ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ డీన్ డాక్టర్ కల్యాణి, టై అసోసియేట్ డైరెక్టర్ వంశీకృష్ణ జడల పాల్గొన్నారు.